క్లుప్తంగా

ఈఏపీసెట్‌కు తిరువూరులో పరీక్ష కేంద్రం ఏర్పాటు

తిరువూరు: ఏపీ ఈఏపీసెట్‌కు తిరువూరు శ్రీ వాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని కేటాయించారని ప్రిన్సిపాల్ రంగా నాగేంద్రబాబు తెలిపారు. గురువారం నుంచి ఈ నెల 23వ తేదీ వరకు రాష్ట్ర ఈఏపీఎస్ కన్వీనర్ ఆధ్వర్యంలో ప్రతి రోజూ రెండు షిఫ్టులలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ పరీక్ష ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారని చెప్పారు. ప్రతి షిఫ్టులో 200 మంది చొప్పున ఈ పరీక్షలకు విద్యార్థులను తమ కళాశాల పరీక్షా కేంద్రానికి కేటాయించారన్నారు. హాల్ టికెట్‌లో సూచించిన నిబంధనల మేరకు విద్యార్థులు హాజరు కావాలని తెలిపారు.

చదరంగం, చిత్రలేఖనం పోటీలు



తిరువూరు: స్థానిక సుందరయ్య భవన్‌లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వేసవి సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణా తరగతుల్లో బుధవారం చదరంగం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికి తీసేందుకు, సృజనాత్మక ధోరణి పెంపొందించేందుకు ఈ పోటీలు దోహదపడతాయని జేవీవీ ప్రతినిధులు రాంప్రదీప్, హరికృష్ణ తెలిపారు. శిక్షణా తరగతుల్లో ఆంగ్ల భాషా నైపుణ్యం పెంపొందించడం, గ్రామర్, స్పోకెన్ ఇంగ్లిష్ నేర్పడం, సులభంగా లెక్కలు చేయడం తదితర వాటిలో శిక్షణ ఇస్తున్నామన్నారు.

రేపు ఇంటర్‌లో ప్రవేశానికి కౌన్సెలింగ్

జి.కొండూరు: కుంటముక్కల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి కౌన్సెలింగ్ ఈ నెల 17వ తేదీన నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ కె. విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థినులకు ఇప్పటికే ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చామని చెప్పారు. 17వ తేదీన ఉదయం 9 గంటలకు కళాశాలకు వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. కౌన్సెలింగ్ మెరిట్‌లిస్ట్ ప్రకారం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని చెప్పారు.

18 నుంచి తిరు కల్యాణోత్సవం

మైలవరం: ద్వారకా తిరుమలలోని వేంకటేశ్వర స్వామి వారి వైశాఖ మాస తిరు కల్యాణోత్సవాలు ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు జరుగుతాయని దేవస్థానం వ్యవస్థాపక ధర్మకర్త, మైలవరం జమీందారు ఎస్వీ సుధాకరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22న స్వామివారి కల్యాణం, 23న రథోత్సవం జరుగుతుందన్నారు. భక్తులు పాల్గొని స్వామి వారి కల్యాణాన్ని తిలకించాలని కోరారు.

వెండి తాపడం పనులకు విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో అంకమ్మవారి ఉపాలయం వెండి తాపడం తయారీకి పెనుగంచిప్రోలుకు చెందిన గరికపాటి శ్రీనివాసరావు, మాధవి దంపతుల కుమారుడు సాయి సాకేత్‌బాబు రూ.11,516 విరాళం ఇచ్చారు. ఈమేరకు నగదును ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. నిత్యాన్నదాన పథకానికి తెలంగాణ రాష్ట్రం, కొత్తగూడెం పట్టణానికి చెందిన తోకల రవి దంపతులు రూ.10 వేలు విరాళంగా అందజేశారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

పటమటలో పోలీస్ బందోబస్తు

పటమట(విజయవాడతూర్పు): సార్వత్రిక ఎన్నికల అనంతరం రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న అల్లర్ల నేపథ్యంలో విజయవాడ కమిషనరేట్ పరిధిలోని పటమట పోలీసులు కూడా స్టేషన్ పరిధిలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాట్లు చేశారు. తీసుకున్నారు. విజయవాడ తూర్పు నియోజకవర్గం పటమట స్టేషన్ పరిధిలోని నిడమానూరు, పటమట, రామలింగేశ్వనగర్, గురునానాక్ నగర్ సెక్టార్‌లో పోలీసులు బుధవారం పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ స్టేషన్ ఎన్టీయార్ జిల్లా, కృష్ణా జిల్లాల పరిధిలో ఉండటం రెండు పార్లమెంటు, రెండు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఉండటంతో పోలీసులు సున్నితమైన ప్రాంతాల్లో అల్లర్లు చెలరేగకుండా పోలీస్ పికెట్‌లు ఏర్పాటు చేశారు.

20న దేశ సమైక్యత- సవాళ్లపై స్మారకోపన్యాసం

కృష్ణలంక(విజయవాడతూర్పు): దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా ఈ నెల 20న సాయంత్రం 6 గంటలకు దేశ సమైక్యత–ఎదురవుతున్న సవాళ్లు అంశంపై స్మారకోపన్యాసం జరుగుతుందని ఎంబీ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పి.మురళీకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాఘవయ్య పార్కు సమీపంలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో జరిగే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సుందరయ్య విజ్ఞాన కేంద్రం చైర్మన్ బీవీ రాఘవులు పాల్గొని ప్రసంగిస్తారని వివరించారు.

మైలవరంలో విద్యా విప్లవం

- గతంలో ప్రాథమిక పాఠశాలలకే పరిమితం
- ప్రస్తుతం ఇంజనీరింగ్ విద్య వరకు ఇక్కడే
- అందుబాటులోకి విద్యాలయాలు



చంద్రగూడెంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఆట స్థలం



ఇబ్రహీంపట్నంలోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్

మైలవరం: నియోజకవర్గ కేంద్రం మైలవరం ఒకప్పుడు నిరక్షరాస్యత, పేదరికంతో అట్టడుగున ఉండేది. గతంలో ప్రాథమిక పాఠశాల విద్య మాత్రమే ఇక్కడ అందుబాటులో ఉండేది. క్రమేణా పెరుగుతూ ప్రస్తుతం డిగ్రీ, ఇంజినీరింగ్ విద్య వరకు పైసా అదనపు ఖర్చు లేకుండా ఇక్కడే విద్యార్థులకు అందుబాటులోకి వచ్చింది. ఉద్యోగావకాశాలు కూడా పెరుగుతున్నాయి. విద్యా రంగంలో మేటిగా నిలుస్తూ విద్యా కేంద్రంగా మైలవరం విరాజిల్లుతోంది. 1947లో మైలవరంలో బాపూజీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ప్రారంభించారు. రాజా ఎస్వీఆర్జీ నరసింహారావు ఆధ్వర్యంలో ప్రారంభించిన ఈ హైస్కూల్‌లో బాలబాలికలు విద్యనభ్యసించేవారు. 1978లో అప్పటి ఎమ్మెల్యే చనమోలు వెంకట్రావు అప్పటి విద్యాశాఖ మంత్రి ఎంవీ కృష్ణారావును ఒప్పించి ఈ పాఠశాలను బాలుర పాఠశాలగా చేసి బాలికల కోసం ప్రత్యేకంగా మరో పాఠశాల ఏర్పాటు చేశారు. అదే సంవత్సరం ప్రభుత్వ జూనియర్ కళాశాలను కూడా ఏర్పాటు చేయడంతో స్థానికులు ఇంటర్ విద్య చదవడానికి ఇతర ప్రాంతాలకు వెళ్లే ఇబ్బంది తప్పింది. దీనితో స్థానికులకు తమ పిల్లలను విద్యావంతులు చేయాలన్న అభిలాష కలిగింది. మైలవరం మండలం వెల్వడం గ్రామానికి చెందిన ప్రవాసాంధ్రులు స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సహాయ సహారాలు అందించడంతో వారికి విద్యపై మక్కువ పెరిగింది. 1998లో ప్రవాసాంధ్రులు లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలను ఏర్పాటు చేశారు. దీనితో మైలవరం ప్రజల దీర్ఘకాల కోరిక నెరవేరినట్లు అయింది. 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం హయాంలో మైలవరానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంజూరు చేశారు. 2019లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మైలవరం అన్ని విధాలుగా అభివృద్ధి చెందింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా విధానంలో నూతన ఒరవడి సృష్టించింది.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగానికి అధిక ప్రాధాన్యమిచ్చారు. నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి మౌలిక వసతులు కల్పించారు. డెస్క్ బెంచీలు ఏర్పాటు చేశారు. విద్యార్థులకు జగనన్న విద్యా కానుక ద్వారా స్కూల్ బ్యాగ్, బూట్లు, సాక్స్‌లు, నోట్‌పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, ఇంగ్లిష్ డిక్షనరీ, వర్క్‌బుక్స్, యూనిఫామ్, బెల్ట్ అందజేస్తున్నారు. మధ్యాహ్నం జగనన్న గోరుముద్ద పేరుతో పౌష్టికాహారాన్ని రోజుకో మెనూ చొప్పున అమలు జేస్తున్నారు. వారానికి ఐదు కోడిగుడ్లు, చిక్కీలు, రాగిజావ ఇస్తున్నారు. విద్యార్థులకు అత్యాధునిక మరుగుదొడ్లను అందుబాటులోకి తీసుకువచ్చారు.

నియోజకవర్గంలో
మొత్తం పాఠశాలలు - 165
నాడు–నేడు ద్వారా ఆధునికీకరించినవి - 142
నాడు–నేడు ద్వారా చేసిన ఖర్చు - రూ. 1427.91 కోట్లు
పాఠశాలల్లో ఉపాధ్యాయుల సంఖ్య - 606 మంది
విద్యార్థుల సంఖ్య - 18,828 మంది

మినరల్ వాటర్ ప్లాంట్ల ద్వారా తాగునీరు అందిస్తున్నారు. డిజిటల్ విద్యను అందిస్తున్నారు.

- ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్ టీవీలు, ఉన్నత పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ ద్వారా విద్యను బోధిస్తున్నారు. బైజూస్ కంటెంట్ విద్యను అందజేసేందుకు ట్యాబ్‌లను విద్యార్థులకు అందజేశారు. స్కూల్‌కు వచ్చే విద్యార్థి కార్పొరేట్ పాఠశాల విద్యార్థికి ఏమాత్రం తగ్గకుండా ఇంకా చెప్పాలంటే అంతకు మించి సౌకర్యాలు కల్పిస్తున్నారు. తల్లులు తమ పిల్లలను బడికి పంపేందుకు ఆర్థికంగా ఇబ్బంది లేకుండా అమ్మ ఒడి ద్వారా ఏటా రూ.15 వేలు తల్లుల ఖాతాలో జమ చేస్తున్నారు. అలాగే ప్రతి ఇంటికీ వైద్య సేవలు అందించే విధంగా గ్రామాల్లోనే వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేసి ఇంటింటికీ వైద్య సౌకర్యం అందజేస్తున్నారు. అంతేగాక గ్రామ సచివాలయాల ద్వారా గ్రామాల్లోనే ప్రభుత్వ సేవలు అందజేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా విద్య, వైద్యంలో మైలవరం నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందింది.

ముందస్తు జాగ్రత్తలతో డెంగీ నివారణ

డెప్యూటీ డీఎంహెచ్‌ఓ జగన్‌మోహన్‌రావు



నూజివీడు: ప్రతి సంవత్సరం మే 16న జాతీయ డెంగీ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని, డెంగీ జ్వరం రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై ప్రజల్లో అవగాహన, చైతన్యం తీసుకురావడమే దీని ముఖ్య ఉద్దేశమని నూజివీడు డెప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ జాస్తి జగన్‌మోహన్‌రావు అన్నారు. పట్టణంలోని కోనేరుపేట యూపీహెచ్‌సీలో బుధవారం నిర్వహించిన సమావేశంలో డెంగీ జ్వరం వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఏఎన్‌ఎంలకు, ఆశా సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సరైన జాగ్రత్తలు తీసుకుంటూ, ప్రతి శుక్రవారం డ్రై డేను పాటిస్తూ ఉంటే డెంగీని తరిమికొట్టవచ్చన్నారు. ఇంటి పరిసరాల్లో మంచినీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని చెప్పారు.

రేపు పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవం

విస్సన్నపేట: స్థానిక సత్తుపల్లిరోడ్డులోని గోవిందమాంబ సమేత పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం శుక్రవారం ఉదయం జరుగుతుందని ఆలయ నిర్వాహకులు బుధవారం తెలిపారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, హనుమాన్ చాలీసా పారాయణం, ఆరాధన కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు

- గ్రామాల్లో చురుగ్గా జరుగుతున్న పనులు
- రూ.10 కోట్లతో నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు
- ఎ. కొండూరులో 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం
- తిరువూరు నియోజకవర్గంలోని గ్రామాలకు ప్రయోజనం



తిరువూరు శివారులోని జగనన్న కాలనీకి విద్యుత్ లైన్ల నిర్మాణం పనులు

తిరువూరు: పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా తిరువూరు నియోజకవర్గంలో విద్యుత్ సరఫరా మెరుగుదలకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో అన్ని గ్రామాల్లో పాత లైన్లకు మరమ్మతులు చేయడంతో పాటు కేబుల్ మార్పు చేసి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టారు. ఎ. కొండూరులో కొత్తగా నిర్మించిన 220 కేవీ సబ్‌స్టేషన్ నుంచి తిరువూరు పట్టణానికి, రూరల్ గ్రామాలకు, గంపలగూడెం మండలానికి ప్రత్యేక 33 కేవీ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు కూడా మంజూరు చేయనున్నారు. తిరువూరు పట్టణంలో నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం నివేశన స్థలాలు పంపిణీ చేసి నిర్మిస్తున్న జగనన్న కాలనీలకు, శివారు ప్రాంతాలకు విద్యుత్ సదుపాయం కల్పిస్తున్నారు. తిరువూరు శివారులోని పీటీకొత్తూరులో నాలుగు లేఅవుట్లలో చేపట్టిన 1500లకు పైగా పక్కా గృహాలకు విద్యుత్ సరఫరా చేస్తున్నారు.

వ్యవసాయ విద్యుత్ సరఫరాకు ప్రత్యేక లైన్లు

తిరువూరు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ కోతలు లేకుండా వ్యవసాయ విద్యుత్ సర్వీసులను వేరు చేసి త్రీఫేజ్ లైన్ల నిర్మాణం జరుపుతున్నారు. 24 గంటలూ గృహావసర విద్యుత్ అందించడం, వ్యవసాయ కనెక్షన్లకు 9 గంటల పాటు సరఫరా ఇవ్వడం ధ్యేయంగా విద్యుత్ అధికారులు పనులు చేపట్టారు. దీర్ఘకాలంగా పాత కేబుల్స్, విద్యుత్ స్తంభాలతో నిత్యం అవస్థలు పడుతున్న వినియోగదారులకు కొత్తగా నిర్మిస్తున్న విద్యుత్ లైన్లతో సమస్యలు పరిష్కారం కానున్నాయి. ప్రత్యామ్నాయ లైన్ల నిర్మాణంతో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినా విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

పెండింగ్ దరఖాస్తులకు మోక్షం

వ్యవసాయ విద్యుత్ అవసరాలకు దరఖాస్తు చేసుకుని మంజూరు కాక నిరీక్షిస్తున్న రైతులకు కొత్త లైన్ల నిర్మాణంతో త్వరితగతిన సర్వీసులు ఇవ్వనున్నారు. ఎన్నికలకు ముందు జగనన్న కాలనీలలో విద్యుత్ కనెక్షన్ల మంజూరుకు రూ.50 లక్షలు మంజూరుకాగా, పనులు చేపట్టడానికి ఎన్నికల కోడ్ అడ్డంకిగా మారింది. త్వరలోనే ఈ పనులను కూడా పూర్తి చేసి వినియోగదారులకు గృహావసర విద్యుత్ కనెక్షన్లు జారీ చేయనున్నారు.



ఇంటింటికీ విద్యుత్ సరఫరాకు ఏర్పాటు చేసిన అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు



ఆధునికీకరిస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్లు



జగనన్న కాలనీలలో విద్యుత్ లైన్ల నిర్మాణం

గర్భిణులు జాగ్రత్తలు పాటించాలి

జగ్గయ్యపేట అర్బన్: వేసవి ఉష్ణోగ్రతల దృష్ట్యా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని జగ్గయ్యపేట సీహెచ్‌సీ సూపరింటెండెంట్ ఆళ్ల హరీష్ సూచించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున చిన్న పిల్లలతో ప్రయాణం చేసేటపుడు ఎండ తగలకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎండల కారణంగా శరీరంలోని నీరంతా చెమట రూపంలో బయటకు పోతోందని, దీంతో నీరసం వస్తుందన్నారు. నిమ్మరసం, ఫ్లూయిడ్స్ వంటివి తరచూ తాగడం ద్వారా నీరసం బారినపడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. డీహైడ్రేషన్, డయేరియా వంటి వ్యాధుల బారిన పడిన వెంటనే సంబంధిత ఆశా వర్కర్ల ద్వారా సమాచారం తెలియజేయాలన్నారు. పట్టణంలో ఇంటింటా ఫీవర్ సర్వే చేయాలని ఆశా కార్యకర్తలకు సూచించారు. పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం, అర్బన్ హెల్త్ సెంటర్లలో అవసరమైన మందులు, ఆధునిక పరికరాలతో కూడిన ల్యాబ్‌లు ఉన్నాయన్నారు. ఎటువంటి పరీక్షలు చేయించుకోవాలన్నా సీహెచ్‌సీని సంప్రదించాలని ప్రజలకు సూచించారు.

జగనన్న కాలనీకి విద్యుత్ సదుపాయంపై హర్షం

జగన్నాథపురం(వీరులపాడు): జగన్నాథపురంలోని జగనన్న కాలనీకి అధికారులు విద్యుత్ సదుపాయం కల్పించడంపై కాలనీవాసులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. గ్రామంలోని ఇళ్లస్థలాలు లేని 20మంది పేదలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద ఇళ్లస్థలాలతోపాటు ఇళ్లు కూడా మంజూరు చేసింది. దీంతో లబ్ధిదారులంతా ఇళ్ల నిర్మాణం చేసుకోగా, ఒకరిద్దరి లబ్ధిదారుల గృహాల నిర్మాణాలు తుది దశలో ఉన్నాయి. ఈ జగనన్న కాలనీకి అధికారులు బోర్లు, మంచినీటి వసతి, కుళాయి కనెక్షన్, రోడ్లు వసతి కల్పించారు. ప్రత్యేకంగా విద్యుత్ స్తంభాలు వేసి విద్యుత్ లైన్ ఏర్పాటు చేయడంతో కాలనీకి అన్నివసతులు సమకూరాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం, జగనన్న కాలనీలకు అన్ని వసతులు కల్పించడం ద్వారా ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటుందంటూ లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సీఎం జగనన్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.



జగనన్న కాలనీలో ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్

ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు : ఏసీపీ

నందిగామ: ఘర్షణలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నియోజకవర్గ ఎన్నికల స్పెషల్ ఏసీపీ డాక్టర్ స్రవంతిరాయ్ హెచ్చరించారు. ఎన్నికల తర్వాత రాష్ట్రంలో పలుచోట్ల వివాదాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో నందిగామలోని డీవీఆర్ కాలనీలో బుధవారం రాత్రి పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఏసీపీ డాక్టర్ స్రవంతిరాయ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయన్నారు. ప్రజలు ఒకరికొకరు స్నేహభావంతో ఉండాలన్నారు. గుంపులు గుంపులుగా ఒకచోట చేరి అనవసర రాజకీయచర్చలు పెట్టవద్దని సూచించారు. ఎవరైనా వివాదాలకు పోతే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో నందిగామ ఇన్‌స్పెక్టర్ హనీష్, ఎస్‌ఐలు పండు దొర, దుర్గామహేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



డీవీఆర్ కాలనీలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

అభ్యర్థుల విజయంపై జోరుగా బెట్టింగులు

- పోలింగ్ సరళిపై సమీక్షలో అభ్యర్థులు బిజీ
- మెజార్టీలపైనా పందేలు
- బెట్టింగ్ రాయుళ్లతో టీ స్టాళ్లు, హోటళ్లలో సందడి

ఆగిరిపల్లి: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ముగియడంతో ప్రధాన పార్టీలకు చెందిన నేతలు గ్రామాల వారీగా కూడికలు, తీసివేతల లెక్కల్లో నిమగ్నమయ్యారు. ఎవరికి వారే గెలుపు దీమాతో ఉన్నారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పాటుపై, నూజివీడు నియోజకవర్గంలో గెలుపుపై సోమ వారం సాయంత్రం నుంచి మండలంలో బెట్టింగులు జోరుగా సాగుతున్నాయి. రాష్ట్రంలో వైఎస్సా ర్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, నూజివీడులో వైఎస్సార్ సీపీ అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు హ్యాట్రిక్ విజయం సాధిస్తారని పొలా లు, ఇంటి స్థలాలపై కూడా పందేలు కాస్తున్నారు. మండలంలో రూ.10 కోట్ల వరకు బెట్టింగ్ జరిగినట్టు తెలిసింది. ఓట్ల లెక్కింపునకు మరికొన్ని రోజులు సమయం ఉండడంతో బెట్టింగులు మరింత జోరందుకునే అవకాశం ఉంది. అభ్యర్థుల విజయంతోపాటు మెజార్టీపైనా పందేలు కాస్తున్నారు. నియోజకవర్గంతో పాటు, పరిసర మండల నాయకులు కూడా నూజివీడు విజయంపై జోరుగా బెట్టింగులు వేస్తున్నారు. మండల కేంద్రమైన ఆగిరిపల్లిలో సాయంత్రం అయితే చాలు చుట్టుపక్కల గ్రామా ల్లోని బెట్టింగ్‌రాయుళ్లతో టీ స్టాళ్లు, హోటళ్లు సందడిగా మారుతున్నాయి.

ప్రారంభమైన పాండురంగడి బ్రహ్మోత్సవాలు



ఎదుర్కోలోత్సవంలో స్వామి




ప్రత్యేక అలంకరణలో స్వామివార్లు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని కొత్తగుళ్ల ప్రాంగణంలో కొలువై ఉన్న పాండురంగడి సన్నిధిలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలోని శ్రీ రుక్మాబాయి సమేత పాండురంగస్వామి వారి ఆలయంలో ద్వాదశ వార్షిక బ్రహ్మోత్సవాలకు బుధవారం శ్రీకారం చుట్టారు. ఉదయం ఆలయంలోని రుక్మాబాయి సమేత పాండురంగడకు ప్రత్యేక తిరుమంజన అభిషేకాన్ని నిర్వహించారు. అందులో భాగంగా పంచామృతాలు, పలు ఫల, విశేష జలాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని పెండ్లి కుమారునిగా, అమ్మవారిని పెళ్లి కుమార్తెగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం హంసవాహనంపై స్వామి వారికి వాహనసేవను జరిపారు. అనంతరం ఎదుర్కోలోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అందులో భాగంగా శేషవాహనంపై స్వామి వారిని అధిష్ఠింపజేశారు. అనంతరం స్వామివారు, అమ్మవార్ల గుణగణాలను కీర్తిస్తూ ఉత్సవాన్ని జరిపారు. పాండురంగ భజన మండలి ఆధ్వర్యంలో రాత్రి సంకీర్తనగానం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. కార్యక్రమాలను అద్దేపల్లి మురళీకృష్ణమాచార్యులు వైదిక కార్యక్రమాలను నిర్వహించారు.

కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో పికెట్

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న హింసాత్మక ఘటనల నేపథ్యంలో కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం పికెట్ ఏర్పాటు చేశారు. స్టేషన్ పరిధిలోని కృష్ణలంక, రాణిగారితోట, ఫకీర్‌గూడెం తదితర ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా స్టేషన్ సీఐ ఎ.మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఎటువంటి ఘటనలు జరగకుండా ముందస్తు చర్యల నేపథ్యంలో పికెట్ ఏర్పాటు చేశారు.

వైభవంగా త్యాగరాజస్వామి జయంతి ఉత్సవాలు



గాత్ర కచేరీ నిర్వహిస్తున్న మల్లాది కార్తీక త్రివేణి

విజయవాడ కల్చరల్: శ్రీ సద్గురు సంగీత సభ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని శివరామ కృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న సద్గురు త్యాగరాజ స్వామి 257 జయంతి ఉత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని సంగీత విద్వాంసులు, యువ సంగీత కళాకారులు పాల్గొని త్యాగరాజ స్వామి పట్ల తమకున్న అభిమానం చాటుకున్నారు. బుధవారం నాటి సంగీతోత్సవంలో సాయి రాధాకృష్ణ గాత్ర కచేరితో ప్రారంభమయ్యాయి. తేజశ్రీ. ఓరుగంటి లక్ష్మి, పి.జయతి, మహతి, లక్ష్మీ శర్వాణి, ఆర్.పద్మశ్రీ, ఎస్.సాత్విక, చెంగల్వ రజని, గండూరి నాగేశ్వర శర్మ, యనమండ్ర శ్రీనివాస శర్మ, మల్లాది కార్తీక త్రివేణి, ధూళిపాల వాసవి త్యాగరాజ స్వామి రచించిన సంకీర్తనలు ఆలపించారు. సంగీత విద్వాంసులు మోదుమూడి సుధాకర్, ఎన్‌సీహెచ్ బుచ్చయ్యాచార్యులు, గాయత్రీ గౌరీనాథ్ పాల్గొన్నారు. శ్రీ సద్గురు సంగీత సభ ప్రధాన కార్యదర్శి గౌరీనాథ్, ఉపాధ్యక్షుడు బీవీఎస్ ప్రకాష్, ఉపాధ్యక్షుడు బి.హరి ప్రసాద్, కోశాధికారి వీఆర్ సుబ్రహ్మణ్యం నిర్వహించారు.